క్లుప్తంగా

ఆలయాల్లో మంత్రి ప్రత్యేక పూజలు



వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలో నారాయణరెడ్డి పల్లెలోని శ్రీ మంచాలమ్మ, గుట్టపల్లె శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాలను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయాలలో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ప్రభాకర్‌నాయుడు, నాగేశ్వర్ నాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రాజంపేట సీఐగా యల్లమరాజు



యల్లమరాజు

రాజంపేట : రాజంపేట సీఐగా యల్లమరాజు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయనకు ముందుగా ముగ్గురు సీఐలు బదిలీపై ఇక్కడి రాకుండానే బదిలీ ఉత్తర్వులు రీవోక్ చేశారు. ఎట్టకేలకు రైల్వేకోడూరు సీఐగా ఉన్న యల్లమరాజు సీఐగా జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖాపరంగా ప్రజలకు మెరుగైన సేవలందిస్తానన్నారు.

రైల్వేకోడూరు రూరల్ సీఐగా..



పి.వెంకటేశ్వర్లు, సీఐ, కోడూరు రూరల్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు రూరల్ సీఐగా పసుపుల వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు తీసుకొన్నారు. ఈయన గతంలో రాయచోటి యాంటీహ్యూమన్ ట్రాఫికింగ్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై కోడూరికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకొంటామన్నారు. పేకాట కోడిపందాలు నిర్వహిస్తే జైలుకు పంపడం ఖాయమని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల కోర్సులు

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పాలిటెక్నిక్‌లో 10వ తరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ, బీటెక్ కోర్సులు చదివిన వారికి ప్రత్యేకంగా సర్టిఫికెట్ల కోసం 45 రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కోర్సులను ఏపీ టెక్నికల్ బోర్డు వారు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులు సెప్టెంబర్ మొదటి వారం నుంచి ప్రారంభిస్తామన్నారు. శిక్షణలో ఇంటర్నెట్ ఆఫ్ థింక్స్, ప్రోగ్రామబుల్ లాజికల్ కంట్రోల్‌లలో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈ శిక్షణ కోసం చేరేందుకు అభ్యర్థులు రూ.1500లు చెల్లించాలని చెప్పారు. వివరాలకు 8985126520 / 7995279315 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రోత్సాహకాలు ఎంతో ఉపయోగకరం



విద్యార్థికి నగదు ప్రోత్సాహకం అందిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

రామాపురం : మండలంలోని కుమ్మరపల్లె పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పంద్రాగస్టు పురస్కరించుకొని శుక్రవారం నగదును బహుమతులను అందజేశారు. మొదటి బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, తృతీయ బహుమతిగా రూ.2వేలు నగదును అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని తెలియజేశారు.

శీతల గంగమ్మకు పూజలు



శీతల గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సిద్దవటం : మండలంలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారికి వైభవంగా పూజలు నిర్వహించారు. వరలక్ష్మి పండుగను పురస్కరించుకొని శుక్రవారం అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పుణ్యాహావాచనం, సహస్రనామార్చన, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కొందరు మహిళలు అమ్మవారిని దర్శించుకుని గుడి చుట్టు ప్రదక్షిణలు చేసి కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

రాములోరి క్షేత్రం.. డ్రైనేజీ అస్తవ్యస్తం



చిన్నపాటి వర్షానికే అరుంధతివాడలో మోకాళ్ల లోతు నీరు చేరిన దృశ్యం (ఫైల్)



కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఒంటిమిట్ట : రెండు దశాబ్దాల నుంచి మండల కేంద్రంలో డ్రైనేజీ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. పేరుగొప్ప, ఊరు దిబ్బ అన్న చందంగా పేరు కేమో ఆంధ్రా భద్రాద్రి, కానీ ఊరిలో ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండి ఉన్న డ్రైనేజీ కాలువలు దర్శనమిస్తున్నాయి. దీనికి కారణం రెండు దశాబ్దాల క్రితం అసంపూర్తిగా నిర్మించిన డ్రైనేజీ కాలువలే అని గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో పెద్ద సమస్య డ్రైనేజీ వ్యవస్థేనని గ్రామ ప్రజలు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికి ఒంటిమిట్ట గ్రామ పురవీధులలో ఉన్న డ్రైనేజీ కాలువలు నిండి ఆ నీరు రోడ్లపై వంకలు, వాగులను తలపించేలా ప్రవహిస్తున్నాయి. ఈ కారణంగా మండల కేంద్రంలోని అరుంధతివాడలోకి నీరు చేరి ప్రజల ఇళ్లల్లోకి చేరుతుండటంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆ డ్రైనేజీ నీటితోపాటు విష సర్పాలు కూడా ఇంటిలోకి వస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మురికినీటి కారణంగా అరుంధతివాడలోని చిన్నారులు, పెద్దలు రోగాల బారిన పడుతున్నట్లు తెలుపుతున్నారు. ఈ సమస్యను కొన్ని వందల సార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కానీ, సమస్యకు పరిష్కారం కానీ అందలేదని గ్రామ ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఒంటిమిట్టను పరిశుభ్రతకు కేంద్రంగా మార్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక ప్రదేశానికి మచ్చలా డ్రైనేజీ



రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా పేరొంది ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్టలో డ్రైనేజీ వ్యవస్థ ఒక మచ్చలా తయారైంది. రెండు దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను ఏ అధికారి గానీ, ఏ నాయకుడు గానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న మరుగున పడ్డ డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేసి ఒంటిమిట్టను ఒక పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్ది, వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాలి.

– ఏలేశ్వరం మధుస్వామి, ఒంటిమిట్ట

మా కష్టాలు తీర్చండి



ఎన్నో ఏళ్ల నుంచి ఒంటిమిట్ట అరుంధతివాడ ప్రజలకు అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ కష్టాలను తీర్చండి. ఈ డ్రైనేజీ అసంపూర్తి వల్ల చెత్తాచెదారంతో కాలువలు నిండి అందులోని నీరు మా అరుంధతివాడలోకి చేరుతున్నాయి. దీంతో మా వాడ మొత్తం మోకాళ్ల లోతు డ్రైనేజీ మురికి నీటితో నిండిపోతుంది. దీంతో విష సర్పాలు, మురికి నీరు కారణంగా దోమలు వల్ల విషజ్వరాల బారిన పడుతున్నాం. ఈ డ్రైనేజీ సమస్యపై ఎన్నిసార్లు ఎంతమంది చెప్పినా మమ్ముల్ని పట్టించుకోలేదు. కనీసం ఇప్పుడైనా స్పందించి మా కష్టాలను తీర్చాలని కోరుతున్నాం.

– చెంచుగొల్ల వెంకటసుబ్బమ్మ, అరుంధతివాడ, ఒంటిమిట్ట

పాలనా ఆమోదం రాలేదు

ఒంటిమిట్టలో అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం గతంలో రూ. 40 లక్షలతో అంచనా వేసి ఉన్నతాధికారులకు పంపించాం. కానీ అక్కడ నుంచి తమకు ఎలాంటి పరిపాలన ఆమోదం రాకపోవడంతో డ్రైనేజీ కాలువ నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టలేకపోతున్నాం. ఉన్నతాధికారుల నుంచి ఆమోదం వచ్చిన వెంటనే డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు చేపడతాం.

– తులసి రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఒంటిమిట్ట

రూ.2.82 లక్షలు పలికిన తలనీలాల వేలంపాట



బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్న ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి

సిద్దవటం : నిత్యపూజ స్వామికి భక్తులు సమర్పించుకునే తలనీలాల వేలం పాటను శుక్రవారం నిర్వహించారు. మండలంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలంపాటలో ఆరుగురు పాల్గొనగా, వీరిలో గుంటూరు జిల్లాకు చెందిన దాసరి మనోహర్ రూ.2.82 లక్షలకు వేలం దక్కించుకున్నట్టు ఈఓ తెలియజేశారు. మహాశివరాత్రి, కార్తీక మాసంలో కాకుండా ఇతర రోజుల్లో భక్తులు సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునేందుకు హక్కుదారులని పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.7వేలు హెచ్చుకు వేలం వెళ్లింది. అంతేగాకుండా ఆలయం ఆవరణలో తాత్కాలిక షాప్‌లకు నిర్వహించిన వేలంపాటలో సిద్దవటం ఎగువ పేటకు చెందిన కూనా విజయభాస్కర్ రూ.1.28లక్షలకు పాటను దక్కించుకున్నారన్నారు. ఈ వేలంలో ఈ ఏడాది స్వామివారికి అదనంగా రూ. 65వేలు ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో రాజంపేట దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఆలయ చైర్మన్ పాటూరు కొండారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, పాటాదారులు, వంతాటిపల్లె గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

భూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించండి



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నైదియా దేవి

వీరబల్లి : మండలంలో ఉన్న ఫ్రీ హోల్డ్ భూముల రికార్డులను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి పరిశీలించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన భూముల వివరాలను తహసీల్దార్ శ్రావణి ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్‌కు సంబంధించిన భూముల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సర్వే చేసేటప్పుడు రైతుల భూముల వద్దకు వెళ్లి పరిశీలించాలని తహసీల్దార్‌కు సూచించారు. భూపంపిణీకి అర్హులను గుర్తించాలని, అసైన్డ్ భూముల వివరాలకు సంబంధించి రికార్డులను సబ్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్‌తోపాటు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఇసుక అక్రమ రవాణా నేరం

సిద్దవటం : ప్రభుత్వ అనుమతులు లేకుండా మండలంలో పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చిరంజీవి హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని పెన్నానదీ పరీవాహక ప్రాంతాలైన ఎస్.రాజంపేట, సిద్దవటం, జంగాలపల్లె, డేగనవాండ్లపల్లె, టక్కోలి గ్రామాల నుంచి రాత్రివేళల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు 3 బృందాలుగా పోలీసుల నిఘాను వేగవంతం చేస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనంలో పోలీసు అధికారుల జాడ కనిపెట్టేందుకు తిరుగుతున్న వారిపై నిఘా పెట్టామన్నారు. అక్రమ ఇసుక రవాణా నిర్వహించే వారిపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని నంబర్‌ల నుంచి ఫోన్లు వస్తే సమాధానం చేయవద్దని సూచించారు.

గతం మరిచారా.. భద్రత గాలికొదిలేశారా?



రాజంపేట పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

రాజంపేట రూరల్ : ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసే విద్యుత్ శాఖ వాటి వద్ద భద్రతను గాలికొదిలేసింది. రాజంపేట పట్టణం, మండలం పరిధిలో ఎటువంటి భద్రతా చర్యలు లేని ట్రాన్స్‌ఫార్మర్‌లు అనేకం దర్శనమిస్తున్నాయి. మనకు కనబడుతున్న ఈ చిత్రంలో భద్రతా లేకుండా కనిపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ పట్టణ నడిబొడ్డులో ఉన్న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలోనిది. నిత్యం సమస్యలను అధికారులకు తెలియజేసేందుకు ప్రజలు ఈ కార్యాలయానికి వస్తుంటారు. అలానే మేత కోసం వచ్చే పశువుల సంచారం కూడా అధికం. ఇది వరకే పట్టణంలో విద్యుత్ ప్రమాదాల్లో ఒక పారిశుద్ధ్య కార్మికుడు, ఓ విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగి మృతి చెందిన సంఘటనలు రాజంపేటలో చోటు చేసుకున్నాయి. ఇవేవి పట్టని విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద భద్రత తమది కాదనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్లు



మోహన్ నాయక్, ఎస్‌ఐ, వీరబల్లి



శివప్రసాద్, ఎస్‌ఐ, ఒంటిమిట్ట



రవిప్రకాష్ రెడ్డి, ఎస్‌ఐ, పెనగలూరు

పెనగలూరు : మండల ఎస్‌ఐగా శుక్రవారం రవిప్రకాష్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రవిప్రకాష్ రెడ్డి చిత్తూరు జిల్లా కల్లూరు పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై పెనగలూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సుభాష్ చంద్రబోస్ కడప రిమ్స్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎస్‌ఐ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ మండలంలో సైబర్ కేసులు ఎక్కడ ఉన్నా వాటిని నిర్మూలిస్తామని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలను మైనర్లు నడిపినా, ముగ్గురు వ్యక్తులు ప్రయాణించినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఒంటిమిట్ట : అసాంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నూతనంగా ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన శివప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాలను అరికడతామన్నారు. మట్కా, జూదం వంటి చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీరబల్లి ఎస్‌ఐగా మోహన్ నాయక్

వీరబల్లి : మండల నూతన ఎస్‌ఐగా శుక్రవారం మోహన్ నాయక్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, జూదం, కోడిపందేలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నా కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో మద్యం సేవిస్తే వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు సరైన ధృవీకరణ పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదిస్తే తప్పక న్యాయం చేస్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాలకు ఎంతో విశిష్టత ఉంటుంది. ఈ కారణంగా మహిళలు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శ్రావణ మాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం రోజు వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఆలయాల్లో, గృహాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయాల్లో మూలవిరాట్‌కు కుంకుమార్చన, సహస్రనామార్చన, అభిషేకాలు జరిపారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వాయనాలను మహిళలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆలయ కమిటీలు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశాయి.

– సాక్షి, నెట్‌వర్క్



నందలూరు: వరలక్ష్మీ వ్రత పూజలు చేస్తున్న మహిళలు



గాలివీడు: వత్రం ఆచరిస్తున్న మహిళలు



సుండుపల్లె: సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులకు వ్రత విశిష్టతను చెబుతున్న అర్చకుడు



చిన్నమండెం: ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ



రైల్వేకోడూరు అర్బన్: కన్యకాపరమేశ్వరీ ఆలయంలో పూజలందుకున్న వాసవీమాత



రాయచోటి టౌన్ : ఉమామహేశ్వరీ అలయంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు



పెనగలూరు: పి.కొత్తపల్లిలో కుంకుమ పూజ నిర్వహిస్తున్న దృశ్యం



ఒంటిమిట్ట: రాములవారి సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న దృశ్యం

దారి ఇలా.. వెళ్లేదెలా..



కంకర రాళ్లు తేలిన రాజువారిపల్లె రహదారి



యర్రమోరంపల్లె రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న దృశ్యం



చిద్రమైన చిన్నబిడికి తారు రోడ్డు

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గుంతలు ఏర్పడటంతో లింకురోడ్లు, తారు రోడ్లపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దేవపట్ల నుంచి చిన్నబిడికి, శెట్టిపల్లె కస్పా నుంచి యర్రమోరంపల్లె, శెట్టిపల్లె నుంచి దుద్యాల కోటకాడపల్లె లింకు రోడ్డు వరకు నిత్యం వందల మంది ఆటోలు, ద్విచక్రవాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. ఈ మార్గాల్లో రోడ్డు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బాలింతలు, గర్భిణులు, ఆటోలో ప్రయాణించాలంటే ప్రాణం అరచేతిలో పెట్టకోవాల్సిన దుస్థితి. అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – సంబేపల్లె

ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదాం



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ జ్యోతిర్మయి

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రాణాంతకమైన ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదామని డైట్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి ప్రజలకు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణం డైట్ కళాశాల ఆవరణలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ఎయిడ్స్ నివారణ – నియంత్రణ సంస్థ, పీసీఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీకు తెలుసా' కార్యక్రమానికి జ్యోతిర్మయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించి చైతన్యపరిచేందుకు యువత విద్యావంతులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎయిడ్స్ రహిత సమాజ స్థాపన లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఎయిడ్స్‌తో బాధపడే వారికి మందుల కంటే తోటి వారి ఆదరణ ఆప్యాయతలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో పీసీఎస్ఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ జీ.చెన్నారెడ్డి, మేనేజర్ స్వాతి, ఎల్‌డబ్ల్యూఎస్ అల్లావలీ, లెక్చరర్లు అసాదుల్లాబాషా, రెడ్డయ్య, నాగేశ్వర, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి ముత్తు మారెమ్మ జాతర

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో వెలసిన ముత్తు మారెమ్మ అమ్మవారి జాతర ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ వరకు అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త స్వామి ఏలుమలై తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ 17న అమ్మవారి మూల విరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు, 18న జాతర, 19న పాలపూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు జాతరలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.